క్లుప్తంగా

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం



నర్సంపేట : పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంపత్ ముడుంబై రామానుజాచార్యులు కల్యాణ మహోత్సవ కైంకర్యాలను భక్తులకు వివరించారు. అనంతరం మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, వికాస తరంగిని సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు వేంశెట్టి శ్రీనివాస్, దుబ్బ రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాల పరిశీలన

రాయపర్తి : మండలంలోని రాగన్నగూడెం మీదుగా గణేష్‌కుంట తండా నుంచి మహబూబ్‌నగర్ గ్రామాల్లో నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వ నేషనల్ క్వాలిటీ మానిటరింగ్ (ఎన్‌క్యూఎం) అధికారి అబ్దుల్ మాజిద్ శనివారం పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన నిర్మాణాలను పరీక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రహదారి నిర్మాణంలో వినియోగించే 8 రకాల కంకర, ఇసుక తదితర సామగ్రిని పరీక్షించినట్లు వివరించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ బాబురావు, ఏఈ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా గోపాల్‌రెడ్డి

చెన్నారావుపేట : స్థానిక మండల వ్యవసాయ అధికారి (ఏఓ)గా చిట్టిరెడ్డి గోపాల్‌రెడ్డి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వరంగల్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వచ్చారు. మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన శశికాంత్ నర్సంపేట వ్యవసాయ శాఖ టెక్నికల్ ఆఫీసర్‌గా వెళ్లాడు.

గ్రంథాలయ ప్రారంభం

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాయింట్ హ్యాండ్స్ ఫౌండేషన్ గ్రంథాలయ ఉద్యమకర్తలు కాసుల రవికుమార్ శోభారాణి శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. పేదరికంపై గెలవడానికి అక్షరాన్ని మించిన ఆయుధం లేదన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు రాజు, శ్రీను, సుదర్శనం, రాజు, దేశ్య, కమల, లక్ష్మి పాల్గొన్నారు.

పరామర్శ



గీసుకొండ : మండలంలోని వంచనగిరిలో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఉపసర్పంచ్ రంపీస రాజేశ్వర్‌రావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి శనివారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపాల నవీన్‌రాజు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు..

పర్వతగిరి : బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్‌ను అతడి తల్లి సరోజన ఇటీవల మృతి చెందిన సందర్భంగా మాజీ మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు శనివారం పరామర్శించారు. అనంతరం ఆ పార్టీ సీనియర్ నాయకుడు తాటికాయల నర్సయ్య కుమార్తె ఇటీవల మృతి చెందగా నాయకులు నర్సయ్యను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పట్టాపురం ఏకాంతం, పాయిలి యాకన్న, గొల్లపల్లి సంతోష్‌కుమార్, బత్తిని జలంధర్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

వడ్లకొండలో..

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన వల్లందాసు సంధ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ పరామర్శించారు. తొలుత సంధ్య చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో అంబేడ్కర్ సంఘం మండల కన్వీనర్ తాటికాయల నర్సయ్య, తదితరులున్నారు.

గొర్రెల అపహరణ

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన కందుగుల రాజుకు చెందిన ఐదు గొర్రెలు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితుడు శనివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం రాత్రి గొర్రెలను దొడ్లోకి తోలి శనివారం తెల్లవారుజామున లెక్కించగా ఐదు తక్కువగా ఉన్నట్లు ఫిర్యాదులో రాజు పేర్కొన్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపాడు.

నర్సంపేట : నిరసన తెలుపుతున్న వైద్యులు, అంగన్‌వాడీ టీచర్లు



నర్సంపేట రూరల్ : జిల్లా ఆస్పత్రి ఆవరణలో నిరసన తెలుపుతున్న వైద్యులు



అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

● జిల్లావ్యాప్తంగా నిరసనలు

సాక్షి నెట్‌వర్క్ : కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వక్తలు డిమాండ్ చేశారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, దుగ్గొండి, తదితర మండలాల్లో ఐఎంఏ ప్రతినిధులు, వైద్యులు, వైద్యసిబ్బంది, ఐసీడీఎస్, విద్యార్థి సంఘాలు శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి అత్యవసర సేవలు అందించారు. ర్యాలీలు తీశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.



వర్ధన్నపేట : నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



దుగ్గొండి : పీహెచ్‌సీ ఎదుట..



చెన్నారావుపేటలో..



సంగెం : పీహెచ్‌సీ ఎదుట..



నెక్కొండలో..

బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దండి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

చెన్నారావుపేట : విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సుభాష్ కోరారు. మండలంలోని చెన్నారావుపేటలోని జెడ్పీ, ప్రైమరీ స్కూళ్లతోపాటు కోనాపురంలో పాఠశాలను శనివారం ఆయన సందర్శించి ఆయా పాఠశాలల్లో నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలను పరిశీలించారు. అనంతరం సుభాష్ మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణ అలవర్చాలని చెప్పారు. స్వేచ్ఛ, బాధ్యత, గౌరవం, దయ వంటి విలువలు ఆచరించేలా తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో హెచ్ఎంలు మానుపాటి పాపమ్మ, ముత్తినేని శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిశోర్, రవి, ఉమాదేవి, రజిని, అనుపమ, శ్రీనివాస్‌రెడ్డి, కౌషీర్, ఆంజనేయులు, ఆజమ్, సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



అపరిశుభ్రంగా డ్రెయినేజీలు

మండలంలోని అమీనాబాద్‌లో డ్రెయినేజీలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. మీ సేవ కేంద్రం సమీపంలోని డ్రెయినేజీలో చెత్తాచెదారం పేరుకుపోయిన దుస్థితి నెలకొంది. ప్లాస్టిక్ బాటిల్స్ వేయడంతో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు ప్రబలి జ్వరాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీలను శుభ్రం చేయించి మురుగు నిల్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. -చెన్నారావుపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
బాదావత్ నిట్టు, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 8106950834

విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా బోధన

దుగ్గొండి : విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా విద్యాబోధన అందిస్తున్నట్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎలగొండ రామస్వామి తెలిపారు. ఆ స్కూల్‌లో శనివారం పేరెంట్స్, టీచర్ మీట్ నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకునేలా అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తున్నట్లు తెలిపారు. విద్యాబోధనలో మెళకువలు పాటిస్తూ విద్యార్థులు సులువుగా పరీక్షలు రాసి మెరుగైన ఫలితాలు సాధించేలా చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయురాలు కూరపాటి సుశీల సమకూర్చిన నగదును రూ.500 చొప్పున బహుమతిగా అందజేశారు.



విద్యార్థికి నగదు అందజేస్తున్న హెచ్ఎం, టీచర్లు

సమాజ అధ్యయనంతో అవగాహన



పోస్టాఫీస్ వద్ద అధ్యయనం చేస్తున్న విద్యార్థులు

ఖానాపురం : సమాజాన్ని అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సదాకర్ తెలిపారు. మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్ విద్యార్థులు శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా ఫీల్డ్ విజిట్ చేశారు. పోస్టాఫీస్‌ను, కిరాణా షాపులతోపాటు పలు అభివృద్ధి పనులను సందర్శించారు. వ్యవసాయ పనులను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ సదాకర్ మాట్లాడారు. ఫీల్డ్ విజిట్‌తో గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పనులపై అవగాహన కలుగుతుందని చెప్పారు. ఏటా పది రోజులపాటు ఫీల్డ్ విజిట్ నిర్వహిస్తామన్నారు. అనంతరం క్విజ్, వ్యకృత్వ, ఆటల పోటీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంగెం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తీగరాజుపల్లికి చెందిన సూత్రపు సదయ్య (55) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వరంగల్‌లోని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన కొక్కొండ నిఖిల్ నడుపుతున్న ద్విచక్ర వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ప్రైవేట్ స్కూల్ వ్యాన్ డ్రైవర్..

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన దుబాసి లక్ష్మీనారాయణ (50) అనారోగ్యానికి గురై ఆస్పత్రికి తీసుకెళ్తుండగా శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు వరంగల్ శివారు మామునూరులోని నవోదయ గురుకుల విద్యాలయంలో వ్యాన్ డ్రైవర్‌గా పని చేసే వాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సంగెం : మండలంలోని గవిచర్లలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శీలం కొమురయ్య దంపతులు శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో వారి కుమారుడు శ్రీకాంత్ ఇంటికి తాళం వేసి తాళం చెవి దర్వాజాపై ఉంచి స్నేహితులతో బయటకు వెళ్లాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తాళం తీసుకుని ఇంట్లోకి ప్రవేశించి రూ.60 వేల విలువైన బంగారు, రూ.45 వేల విలువైన వెండి ఆభరణాలు అపహరించాడు. ఇంటికి వచ్చిన శ్రీకాంత్ ఇంట్లోని వస్తువులు చిందర వందరగా ఉండడాన్ని చూసి అనుమానంతో డబ్బాల్లో దాచిన బంగారు, వెండి ఆభరణాల కోసం వెతికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై లావుడ్య నరేష్ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

ఖానాపురం : మండలంలోని బాలుతండా గ్రామ పంచాయతీ కానున్న క్రమంలో తండాలో బీఆర్ఎస్ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. తొలుత బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు ఎర్రనాగుల మంగ్యానాయక్ మాట్లాడారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గతంలో పంచాయతీగా ఏర్పడలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో గ్రామ పంచాయతీ ఏర్పాటు సాధ్యమవుతోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రనాగుల అచ్చమ్మ, నాయకులు భూక్య బావుసింగ్, బానోతు వీరన్న, తేజావత్ శంకర్, వెంకన్న, లాలు, వెంకన్న, భిక్షపతి, బాల, హేమ్లా, లాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయి వద్ద పూజ చేస్తున్న నాయకులు

తెలంగాణ అభివృద్ధికి టీడీఎఫ్ కృషి

నర్సంపేట : తెలంగాణ అభివృద్ధికి తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) కృషి చేస్తుందని వ్యవస్థాపక సభ్యుడు ఏనుగు లక్ష్మణ్‌రెడ్డి తెలిపారు. ఫోరం ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కాంక్షిస్తూ ఎన్ఆర్ఐలు టీడీఎఫ్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. బతుకుదెరువు కోసం విదేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూనే సంపాదన నుంచి తెలంగాణ సాధనకు వెచ్చించి ధూంధాం కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సభలు, సమావేశాలు, సెమినార్లు ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా కృషి చేశామన్నారు. ఒకానొక దశలో నిద్రపోతున్న రాజకీయ నాయకులను సైతం మేల్కొలిపిన ఘనత ఫోరానికే దక్కుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన బాకీ సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి చిన్ననాటి మిత్రులు శనివారం రూ.25,500 సాయం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సుధాకర్ స్నేహితులు ఎర్ర రవీందర్, వీరేందర్‌రెడ్డి, కుమారస్వామి, అనుముల సుధాకర్, పెండ్యాల యాదగిరి, చింతకాయల మహేందర్, చెలుకలపెల్లి నర్సింహస్వామి, నాంపెల్లి కుమార్, పాలకుర్తి వెంకటేశ్వర్లు, ముత్యం లక్ష్మణ్, తోట రవి, గౌడిశాల విజేందర్, గూడ రవీందర్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

పాత ముగ్దుంపురంలో..

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన సుతారి రాజశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా అతడికి అతడితోపాటు జాగృతి స్కూల్‌లో చదువుకున్న చిన్ననాటి స్నేహితులు శనివారం రూ.8200 నగదు సాయం చేశారు. తొలుత రాజశేఖర్‌ను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాజశేఖర్ స్నేహితులు అన్న బీరేంద్ర, వల్లవేణు, కెంచ ప్రవీణ్, పులిశేరు రాజేందర్, పల్లకొండ తిరుపతి, ముత్యం రాజు, మేడి కార్తీక్, గాదగోని రాజు, రాసమల్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు 'ఎస్ఆర్ఆర్' సేవలు

రాయపర్తి : పేద కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బురహాన్‌పల్లికి చెందిన బొమ్మరబోయిన కొమురయ్య కుటుంబానికి శ్రీనివాస్‌రెడ్డి శనివారం 75 కేజీల బియ్యంతోపాటు నూనె డబ్బా సాయంగా అందించారు. అనంతరం మైలారంలో ఒంటరి మహిళ వడ్డె మమతకు రూ.5 వేల నగదు అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. పేద కుటుంబాలను ఆదుకునేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేయడంతోపాటు ఇతర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. తన జన్మనిచ్చిన రాయపర్తి మండలానికి సేవలు అందించడానికి ఎల్లవేళలా ముందుంటానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అమ్మి దేవేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, కోల అశోక్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు రాఖీ



నర్సంపేట : విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

నర్సంపేట : నర్సంపేటలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో శనివారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. గీతాంజలి హైస్కూల్‌లో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీ కట్టి సందడి చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. పండుల పట్ల విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకోవాలని ససూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవన్‌కుమార్, రాధ, పూర్ణచందర్, రాజు, సోనీ, అజయ్, వీరన్న, శంకర్, కృష్ణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని అక్షర ద స్కూల్‌లో విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. వేడుకలను ప్రిన్సిపాల్ జ్యోతి ప్రారంభించి మాట్లాడారు.

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపెల్లి హైస్కూల్‌లో, చెన్నారావుపేటలోని సిద్ధార్థ హైస్కూల్‌లో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీ కట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రాగి శశిధర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ చింతకింది సుజాత, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్ఎంలుగా ఉద్యోగ ఉన్నతి హర్షణీయం

● ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజా



మాట్లాడుతున్న ఖాజా బాబు

నర్సంపేట : ఎన్‌పీడీసీఎల్ జేఎల్ఎంలకు ఏఎల్ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించడం హర్షణీయమని ఐఎన్‌టీయూసీ-327 జిల్లా సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజా బాబు అన్నారు. యూనియన్ నర్సంపేట డివిజన్ ప్రెసిడెంట్ సలీంపాషా ఆధ్వర్యంలో పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, యూనియన్ సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఖాజా బాబు మాట్లాడారు. విద్యుత్ కార్మికుల సమస్యలను యూనియన్ సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే విద్యుత్ సంస్థ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసిన తరుణంలో తొలుత ప్రస్తుతం పని చేస్తున్న జేఎల్ఎంలను ఏఎల్ఎంలుగా ప్రమోషన్ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అడిషనల్ సెక్రెటరీ గుండా శ్రీనివాస్, డివిజన్ సెక్రెటరీ చుక్క రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జైతురామ్, సీనియర్ అసిస్టెంట్ సోమన్న, లైన్‌మెన్లు భానోతు రాజు, సయ్యద్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధుల నుంచి రక్షణ



సంగెం : పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సంగెం : సమాజంలోని ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని బీకోజీనాయక్ తండాలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

దోమల నివారణ మందు పిచికారీ

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేట, బుధరావుపేటల్లో డెంగీ కేసులు నమోదు కావడంతో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు జ్వరాలు, ఇతర సమస్యలుంటే పీహెచ్‌సీ వచ్చి వైద్యం చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమాల్లో వైద్యురాలు సునీత, సిబ్బంది భాస్కర్, రాజయ్య, దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

నల్లబెల్లి : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో చోటు చేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీ నేపథ్యంలో పీఏసీఎస్‌లో అక్రమాలు బయటపడడం కలకలం రేపుతోందన్నారు. డివిజన్‌లోని అన్ని పీఏసీఎస్‌ల్లోనూ అక్రమాలు జరిగి ఉండొచ్చని తెలిపారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అన్ని పీఏసీఎస్‌ల్లో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి దామ సాంబయ్య, నాయకులు మంద సంజీవ, శ్రీధర్ బాబు, సుధారాణి, గుండెబోయిన ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

నర్సంపేట రూరల్ : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ కోరారు. నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన గొర్రె శారద, ఆమె కుమారులు అజయ్, విజయ్‌ల ఇంటిని దేవేందర్ ఆధ్వర్యంలోని బృందం శనివారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తులు కాలి బూడిదయ్యాయని చెప్పారు. బాధిత కుటుంబానికి తక్షణమే ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల యాదగిరి, నాయకులు దండు తిరుపతి, పోలబోయిన నూతన్, దండు రవి, రమేష్, సతీష్, నర్సయ్య, రాజమౌళి, రవి, రాజు, యాదగిరి, నరేష్, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలకం

రాయపర్తి : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలకమని ఎంపీఓ కూచన ప్రకాష్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో ప్రగతి నివేదికలు రూపొందించడంపై శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీ నుంచి సర్టిఫికెట్లు జారీ చేసే విషయమై అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సరఫరా, సర్టిఫికెట్ల జారీ, తదితర విధుల్లో ప్రభుత్వ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నల్లబెల్లి : మండలంలోని బొల్లోనిపల్లి, రుద్రగూడెం, నారక్కపేట, మేడపల్లి, తదితర గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం పంపిణీ చేశారు. అనంతరం అశోక్ మాట్లాడారు. పలువురు పేదలు అనారోగ్యంతో ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు సిద్ధ సంతోష్, అజ్మీరా తిరుపతి, వంగర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.